

# 10 వినాయక వ్రతము కథ

మర్నాడు సుబ్బరాజు వెంట ఒక చక్కదనాల చుక్క వచ్చింది. ఆ చిన్నది బొద్దుగా బంతిపూల రథంలా ఉంది. నందివర్ధన పువ్వులాంటి తెల్లటి చీర కట్టింది. ఆ పిల్ల ఎలక్షను వాగ్దానంలా ఏపుగా నదరుగా ఉంది. సుస్థిర ప్రభుత్వంలా ధీమాగా ఉంది. కాబోయే మంత్రిగారి ముఖంలా కళకళలాడుతూంది. లంచగొండి ఉద్యోగంలా పచ్చగా ఉంది. గిట్టని వాళ్ళ ప్రచారంలా నల్లగా ఒత్తుగా ఉన్న జుత్తువల్ల ఆ పసుపుఛాయ మరింత ప్రస్ఫుటంగా మెరుస్తూంది. రాజనీతిజ్ఞుడి భాషలా, అవకాశవాది అబద్ధాలలా ఆమె కనులు సొగసుగా తీర్చిదిద్ది ఉన్నాయి. అభివృద్ధిని మనోహరంగా చూపే 'స్టాటిస్టిక్స్' అంకెలలా ఆమె పలు వరుస మిలమిల మెరుస్తోంది. ప్రజాస్వామ్య సూత్రాలపై ఉద్ఘోషలా ఆమె మంగళగళ సీమలో ఆభరణాలు మెరుస్తున్నాయి. ఆపైన (లేదా ఆ దిగువ) పన్నుల భారంతో క్రుంగిన ఆపన్నుల జీవితంలా వీపు కొంచెం ముందుకు వంగి వింత అందాన్ని సంతరించుకుంది. సామాన్యుడి సుఖంలా సంతోషంలా ఆమె సన్నటి నడుము అస్తినాస్తి సందేహం కలిగిస్తూంది. ఆపాదమస్తకం కిటకిటలాడేలా ధరించిన రకరకాల ఆభరణాలు ప్రభుత్వం అలరించుకొనే కమిటీలూ, సబ్ కమిటీలలా ధగధగ మెరుస్తూ ప్రజాస్వామ్య దీద్యుతుల్ని వెదజల్లుతున్నాయి.

"ఏమిటీ వేషం? ఎవరీ పిల్ల?" అన్నారు రెడ్డిగారు.

"అఁ మీ కథల్లో ఎక్కడా ఆడపడుచుల్లేరు. సెక్సప్పీలు కనబళ్ళా. అందుకని తీసుకొచ్చా" అన్నాడు సుబ్బరాజు నవ్వి. "ఇహ నువ్వెళ్ళమ్మా" అని మనిషిని తోడిచ్చి ఆ చిన్నదాన్ని సాగనంపి కూర్చున్నాడు.

"అవునుగాని సుబ్బరాజూ, ఇంతకీ మీవాడి పరిస్థితేమిటి? చెప్పావు కాదు. మనవొచ్చి చెప్పే మంచి ముక్కల మాటలలా వుంచి, ఆయన వెదజల్లే డబ్బు మూటలలా ఉంచి, అసలు పలుకుబడీ గట్రా బాగా ఉన్నవాడేనా?" అన్నారు రెడ్డిగారు.

"లేపోతే నేను మిమ్మల్నెందుకు శ్రమబెడతానూ? పిల్లా మేకా అందరికీ గురే"

"అది సర్లే. ఓ కథ చెబుతా విప్పు. అనగనగా ఓ పంతులారు. మంచి సందడైన మనిషి. దర్జా అయిన విగ్రహం. చేతిలో అట్టే ఎముకల్లేవు. బొత్తిగా లేవని కొందరన్నారు. అన్నవాళ్ళు బత్రాజులు కదా ఎందుకేనా మంచిదని ఓమారు

చేతులు ఎక్కురే ఫోటోలు కూడా తీయించాడంటారు. ఎక్కడా ఎముక్కనబళ్ళేదుట. డాక్టర్లంతా ముక్కున వేలేసుకుని హౌరా అన్నారుట. ఆ ఫోటోలికి పటాలుగట్టించి ఇళ్ళలో శిబి దధీచి వాళ్ళ పక్క వేళ్ళాడగట్టారు. ఊరంతా ఆయన్ని ఓహో అని చెప్పుకున్నారు. జరుగుబడికి, పిత్రార్జితమైన భూమి, స్వార్జితమైన మేడ, చిన్న వ్యాపారం ఉన్నాయి. ఒడుపు తెలిసి నడిపేవాడు వ్యాపారం. అలాని దగాజేస్తాడు అనేవు. అదేం లేదు. పది రూపాయలని పాతికలా తిప్పే చాకచక్యం అంతే.

"పంతులారూ పంతులారూ! ఎలాగా వ్యాపారంలో దిగారు, పోనీ ఆ రాజకీయాల్లో కూడా నాలుగు డబ్బులు తిప్పరాదా? ఎన్నాళ్ళిలా గొర్రెతోకలా ఉంటారు" అన్నాడొక నేస్తం ఓనాడు.

"నాకు చెప్పావులేగాని నువ్వెందుకు దిగవూ" అన్నాడీయన. "పెద్దలు, బుద్ధి కుశలత ఉన్నవారు. మీరు దిగి దారిదీస్తే వెనక మేమూ వస్తాం. దానికేం"టన్నాడు నేస్తం. ఎదటిమనిషి పోచికోలు కబుర్లు చెప్పేవాడు కాదనీ, గోతిలో దింపే సలహాలివ్వడనీ పంతులుగారికి గురి. అందుకని ఆ మాట మీద మనస్సు పెట్టి చాలా ఆలోచించాడు. లోగడ ఒకటి రెండుసార్లు కవున్సిలుకు నిలబడి ఓ మారు చేయి కాల్చుకు నాలిక్కరుచుకున్నాడనుకో. అయినా అది పెద్ద పాలిటిక్సు గాదని ఎవరో చెప్పగా సరిపెట్టుకున్నాడు. జిల్లా బోర్డుకో, బావుంటే ఎసెంబ్లీకో నిలబడాలి అన్నాడు ఆ చెప్పినాయన. పంతులుగారు పదిమందినీ కదిలేసి చూశారు. చూచాయగా బాగా లావుగా ఉన్నవాళ్ళు తప్ప మిగతా వాళ్ళంతా ఎగిరి గంతేశారు. చివరికోనాడు మంచి ముహూర్తం చూసి పూజార్ని సాక్షెం వేసి దేవుడికి సంగజ్జెప్పి 'దిగుతున్నాను' అనుకున్నాడు. సరిగా ఆ ముహూర్తాన పవరులో ఉన్న ఆ ఊరి ఎమ్మెల్యేకి ఎడం భుజ వదిరింది. ఏమిటి? అన్నాడాయన. మీది కాదు మాది అన్నారు వందిమాగధులు. మీ ఇద్దరికీ ఎడం భుజం వొకటే ఎలాగుంటుంది అని ఆయన అడగలేదనుకో తట్టినా అడగడు, అడక్కూడదు. కళ్ళు మూసుకోవాలి. ఆయన కళ్లు మూసుకునేసరికి ఎడంకన్నదిరింది. ఏమిటది అన్నాడు ఉలికిపడి. మీదికాదు మాది అన్నారు వందిమాగధులు. నమ్మను, ఇంకేదన్నా చెప్పండి అన్నాడాయన. అయితే ఎడమకన్ను కాబట్టి మీ శత్రువుర్ది, లేదా కమ్యూనిస్టుర్ది అన్నారు వందిమాగధులు. ఆయన – ఆయన పేరు రావుగారులే – నవ్వలేదు. 'నేను ఒకప్పుడు ఆ పార్టీలో ఉన్నాగా' అనబోయి, దానికి వాళ్ళు కొత్త సంజాయిషీ ఏం చెప్పలేరనీ, చెప్పగలిగినా అంత ప్రతిభ చూపినందుకు ఇంక్రిమెంట్లడుగుతారనీ భయపడి మాటాడకూరుకున్నారు. అంతలో ఫోను మోగింది గణగణ.

ఫోనందుకున్నారు రావుగారు.

"అవునండీ, నేను రావుగారినే మాట్లాడుతున్నా, ఆఁ ఏవిటీ!...." అంటూ ఫోను కింద పడేశాడు.

అదీ సంగతి. పంతులుగారు ఫీల్డులోకి దిగుతున్నారన్న వార్త అంత గట్టిగా తగిలింది.

పంతులుగారి నిర్ణయం దరిమిలాను ఊళ్ళో తెలిసింది. ఓదార్చేవాళ్ళూ, ధైర్యం చెప్పేవాళ్ళూ, ఉత్సాహపరిచేవాళ్ళూ డ్యూటిలోకొచ్చారు. అంత కో ఘడియ ముందుగానే శిలావిగ్రహం పెయింటింగుల కంట్రాక్టరొచ్చి, పంతులుగారి జాతక

వోసారిమ్మని చూసి, అయ్యబాబోయ్ అని వంగి నమస్కారం చేసి, ఇప్పణ్ణించి పని మొదలెడితే తప్ప తెమల్దని చెప్పి, ఓ శిలావిగ్రహానికి (కంచుది ఇప్పుడిప్పుడే వద్దని ఆయనే చెప్పాడు) ఓ ఆయిలు పెయింటింగుకి ఆర్డర్ బుక్ చేసుకుని వెళ్ళాడు.

"బావగారికి అప్పుడే మినిస్టరు కళొచ్చేసింది గదే" అన్నాడు ఈ వార్త తెలిసి చూడవచ్చిన చుట్టంగారు. భార్యకేసి తిరిగి – "ఒరేయ్ మావయ్యకీ జై అనండ్రా" అని పిల్లల్ని హెచ్చరించాడు.

"ఈ శశభిషలు కుదరవు" అన్నారు పంతులుగారు చుట్టంగారి సామానులో ఆవకాయ కుండ బద్దలు కొట్టి.

"చెప్పొచ్చుగా? ఈ పాటిదానికి కుండలు పగలకొట్టడం దేనికీ" అన్నాడు చుట్టం మండిపడి. చూస్తాగా నేను లేందే ఇదెలా జరుగుతుందో అని జనాంతికం విసిరాడు.

నిజమే. పెళ్ళిళ్ళూ ఎలక్షన్లూ పొలాల అమ్మకాలూ కొనడాలూ కొందరు లేందే జరగవు. కాని పంతులుగారు సూటిగా పోయే రకం. నేనూ నా ప్రజలూ చూసుకొంటాం. మధ్య వీళ్ళెందుకని ఆయన తాత్పర్యం. ఎన్నికల అభ్యర్థుల చుట్టూ చేరే భజంత్రీ మేళాలంటే ఆయనకు వెగటు.

ఎలక్షను కెక్కాలని నిర్ణయించుకునే ముందు ఆయన నాలుగు రకాల వారినీ (అనగా కల్తీలేని ప్రజల్నీ), ఉత్తినే ఓటేసిపోయే సత్యకాలపు గొర్రెల మందల్నీ అడిగాడు – నేన్నిలబడనా? అని. ఎంతమాట. మీరు వస్తే ఓట్లకేమి లోటు అన్నారు. వారంతా ఆపైన ఆప్తమిత్రులు – తనను ఏదీ కోరకుండా అయితే గియితే ఇచ్చే మనసూ తాహతూ ఉన్నవాళ్ళు అయిదారుగురిని సంప్రదించాడు. 'ప్రజాబలం ఉన్నవాడివి పార్టీ మన్నించకేం చేస్తుంది' అన్నారు వారు.

కాని బుక్కింగు ఆఫీసు దగ్గర చాలా రద్దీగా వుంది. నాయకులూ, వినాయకులూ, తన మాట విని 'అలాగా సంతోషం' అన్నారు చప్పగా నవ్వి. పంతులుగారి కది చప్పటి నవ్వు అని తోచలేదు. "ఊరికే వచ్చేపోయే వాళ్ళందర్నీ చూచి నవ్వాలి మరి, పైగా ఎలక్షన్ వేళ కాబట్టి అడ్డమైన వాళ్ళనీ చూసి నవ్వాలి. నవ్వి నవ్వి అలిసిపోయుంటారు" అని సర్ది చెప్పాడు ఒక మిత్రుడు. పంతులుగారు కోరగా చూశాడు అతనికేసి. ఈరకం భాష, ఈ సర్దుళ్ళు ఆయనకి గిట్టవు మరి. అతను అలిగి, తగ్గి తప్పుకున్నాడు.

పార్టీ టిక్కెట్టు గురించి పదిమంది పెద్దలతోనూ మాట్లాడాడు పంతులుగారు. జిల్లా, తాలూకా, పట్టణ మండళ్ళ వాళ్ళతో మాట్లాడాడు. ఎన్నికయితే తన ప్రాంతంలో తాను సాధించదలచుకున్న మంచి పన్లనూ అవసర కార్యక్రమాలనూ వాళ్ళు విన్నా, మానినా సరే అన్నీ వివరించి చెప్పాడు పార్టీ పద్ధతులు ఆధారంగానే. వాటికి అనుకూలంగానే తనూ ఒక మానిఫెస్టో రాసుకొచ్చి చూపించాడు.

ఆ టిక్కెట్టుకే కిటికీలో చేయిజాపిన సిట్టింగు (ప్రెట్టీ) మెంబరు రావుగారు కూడా హడావుడిగానే తిరుగుతున్నారు. ఆయన చేతిలో మానిఫెస్టో కాయితాలు లేవు. పంతులుగారు నవ్వుకున్నాడు – "వీరి మొహం. మానిఫెస్టో లేకుండా వీరెక్కడ నెగ్గి ఏడుస్తారు" అని – పెద్దవాళ్లు రేపు మొహం వాచేలా చివాట్లేస్తారు. ఎల్లుండి ఆ 'వాచిన మొహం' ఫోటోలను తను ఫ్రేం కట్టించి ఇవ్వచ్చు...'.

కాని టిక్కెట్లిచ్చే వేళ కథ అడ్డం తిరిగింది.

"టిక్కెట్టుదేవుంది? అది గేటు పాసే. అనక మీరు ఎన్నిక కాగలగాలి. ప్రజల్లో బలం ఉండాలి. పలుకుబడి ఉండాలి, అదుంటే టిక్కెట్టు ఇట్టే వస్తుంది" అన్నాడు బుక్కింగ్ ఆఫీసరు ముసి ముసి నవ్వులు నవ్వుతూ.

అభ్యర్థులిద్దరూ ఏకకాలంలో రొమ్ము విరిచారు. రావుగారు కాలరు సర్దుకున్నాడు. లాల్చీ వేసుకున్న పంతులుగారు కండువా సవరించుకున్నాడు ధీమాగా.

"మీగురించి ప్రజల్లో ఉన్న అభిప్రాయం మేం వాకబు చేస్తాం. మా వాళ్ళొస్తారు. వాళ్ళకి దాఖలా కనబడాలి. మీ ఓటర్లను సిద్ధం చేసుకోండి" అన్నాడు టికెట్లాయన.

పంతులుగారు ఆ పూటే రైలెక్కి ఇంటికొచ్చారు. తన బలగాన్ని పోగేసి జరిగిన కథ చెప్పాడు. తను ఎన్నికయితే సాధించే మంచి పన్లు అందరికీ తెలియజెప్పాడు. ఆయా వర్గాల సమస్యలు కనుక్కొని, కావలసిన మంచి పనులు తెలుసుకున్నాడు. దాదాపు ప్రతీ ఇంటికీ వెళ్ళి, అందర్నీ పలకరించి వాళ్ళచేత అవుననిపించుకున్నాడు. పది రోజులు పట్టింది ఈ పన్లకి.... మరి పది రోజులపాటు చుట్టు పక్కల పల్లెలూ బస్తీలూ తిరిగాడు. నూటికి డెబ్భై మందైనా తననీ, తన కుటుంబాన్నీ ఎరిగున్నవారే. ఈ మూడు వారాల్లోనూ తొలి వారం అంతా రావు కూడా ఎక్కడ వచ్చేసి తనకి పోటీ ప్రచారం చేస్తాడో అని భయపడ్డాడు. రెండో వారం అంతా 'వీడింకా రాలేదేవిటీ? వెర్రి వెధవ' అని ఆశ్చర్యపోయాడు. మూడో వారం 'ఎంచేత చెప్మా' అని మథనపడ్డాడు. పార్టీ పరిశీలకులు కూడా వచ్చి ప్రజాభిప్రాయం వాకబు చేసి వెళ్ళారనీ తెలిసింది. వాళ్ళని వెళ్ళి పలకరించవచ్చు గాని, వెధవది ఆశ్రయించి నట్టుంటుందని పంతులుగారు ఊరుకున్నారు.

నాలుగోవారంలో లోపాయికారీ వార్త గుప్పుమంది – టిక్కెట్టు రావుగారికే దొరికిందని.

పంతులుగారు నిర్ఘాంతపోయారు; తెప్పరిల్లి కూలిపోయారు; కోలుకుని మండిపడ్డారు; లేచి నడుం బిగించారు. ఘోరం, అక్రమం అన్యాయం అన్నారు.

ఇప్పటికే అడ్వాన్సు ఎలక్షను ఖర్చులు తడిసి మోపెడయ్యాయి. నిండా మునిగాక చలేమిటి కడతేరా నిలబడి చూడు అన్నాడు ఆప్తమిత్రుడు. పౌరుషం కొద్దీ ప్రతిష్ట కోసం పంతులుగారు ముందడుగు వేశారు. "ప్రజల అండదండలుండగా భయమేల" అని ఒక కరపత్రం ప్రచురించి ఆ రోజునే స్వతంత్రుడుగా పోటీ చేస్తానంటూ దరఖాస్తు పడేశాడు. ప్రచారం హోరాహోరీగా సాగింది. పోటీ ఇద్దరికే పడింది. ప్రజల ప్రతినిధిగా తాను వెళ్తే ప్రజల శ్రేయస్సు కోసం, తన నియోజకవర్గం అభివృద్ధి కోసం, ఊరు బాగు కోసం, కుటుంబాల మేలు కోసం ఏమేం చేస్తాడో వివరిస్తూ పంతులుగారు స్వతంత్రమైన ధోరణిలో ప్రచారం చేశారు. గ్రూపుల, దళారుల మద్దతు వద్దన్నారు. నామీద నమ్మకం ఉంటే సహకరించండి అన్నారు. కొందరు సహకరించడానికే పూనుకున్నారు. తోడ్పాటూ చేశారు.

కాని, చివరికి రావుగారే నెగ్గేడు బ్రహ్మాండమైన మెజారిటీ కాకపోయినా, మొత్తం మీద బాగానే నెగ్గాడు.

"సుబ్బరాజూ, పంతులుగారి వల్ల జరిగిన లోపం ఏవిటి? రావుగారు పొడిచేసిందేవిటి? అసలు రావు ప్రజల మొహం చూడకపోయినా, ఇటు పంతులు మనిషి మనిషినీ పట్టుకు

మంచి చేసుకున్నా పంతులుకి పార్టీ టిక్కెట్టు కూడా దొరక్కపోవడానిక్కారణవేవిటి? చెప్పు చూద్దాం" అన్నారు రెడ్డిగారు.

సుబ్బరాజు నవ్వాడు. శివపార్వతులొకనాడు, ప్రపంచాన్ని మూడుసార్లు ప్రదక్షిణాలు చేసి ముందొచ్చిన వారిని ప్రమథ గణాలకి నాయకుణ్ణి చేస్తామన్నారు... కుమారస్వామి రొప్పుతూ రొప్పుతూ పరిగెత్తాడు. ఆ లోపల గడుసువాడు, బుద్ధిశాలి వినాయకుడు తల్లిదండ్రుల చుట్టూ ముమ్మారు తిరిగి మీలోనే భువనాలన్నీ ఉన్నాయి కదా అన్నాడు. వారు ఇట్టే ఉప్పొంగిపోయి అట్టే సేనాధిపత్యం ఒప్పజెప్పారు. మరి, ప్రజాస్వామ్యంలో ప్రజలే నాయకులు, నాయకులే ప్రజలన్న సత్యం రావుగారికి తెలుసు. ఆయన వినాయక వ్రతం చేశారు.

"ఇహపోతే పంతులుగారు అసలు ఎలక్షనులో గెలవకపోడానికి ఇలాటిదే కారణం. ప్రతి అభ్యర్థికీ రెండు మానిఫెస్టోలుంటాయి... డబులెంట్రీ పద్దుల్లాగ – ఒకటి ప్రజలను ఆశపెట్టి ఆకట్టుకునేది. రెండోది గ్రూపులనూ నాయక వినాయకులనూ ఆకట్టుకునేది. పంతులుగారు మొదటి ప్రణాళిక గురించే తిప్పలు పడ్డారు తప్ప, దానికన్నా ముఖ్యమైన రెండో ప్రణాళిక తయారుచెయ్యలేదు. పెద్దలను మంచి చేసుకోలేదు. అదే పెద్ద పొరపాటు" అన్నాడు.

"రేపు రా" అన్నాడు రామిరెడ్డిగారు మందహాసం చేసి.

★ ★ ★